క్లుప్తంగా

అర్హుల జాబితా ప్రదర్శన

ఆనందపురం : మండలంలోని వేములవలసలో వైఎస్సార్ జగనన్న కాలనీ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలతో కూడిన జాబితాను గురువారం స్థానిక సచివాలయం వద్ద అందుబాటులో వుంచారు. వేములవలస పంచాయతీలో జగనన్న కాలనీ ఇళ్ల కోసం 276 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు అధికారులతో కూడిన నాలుగు బృందాలు ఇటీవల ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులను పరిశీలించారు. మేరకు అందులో 172 మంది అర్హులుగా, 104 మందిని అనర్హులుగా నిర్ధారించి జాబితా రూపొందించారు. ఆ జాబితాను సచివాలయం వద్ద వేలాడదీసి ఎవరికైనా అభ్యంతరాలుంటే మూడు రోజుల్లో తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ హేమంత్ కుమార్ కోరారు.

‘18లోగా వివరాలు సమర్పించండి’

ఆనందపురం : అనియత విద్యా శాఖలో గతంలో పనిచేసిన వారి వివరాలను జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీకి సమర్పించుకోవాలని అనియత విద్య బోధకుల, సూపర్‌వైజర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహంతి రమణ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం అందజేయగా గతంలో అనియత విద్యా ప్రాజెక్టులో బోధకులు, సూపర్‌వైజర్లుగా పనిచేసిన వారికి ఉపాధి కల్పించే అవకాశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు సర్వీసు సర్టిఫికెట్లు, అపాయింట్‌మెంట్ ఆర్డరు వంటివి ఈ నెల 18లోపు అందజేయాలని కోరారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ


అర్హులకు పట్టాలు అందిస్తున్న నర్సింగరావు

భీమునిపట్నం : భీమిలి ఎగువపేట సచివాలయ పరిధిలోని స్మిత్ స్ట్రీట్ ప్రాంతానికి చెందిన అర్హులకు ఇళ్ల పట్టాలు వైఎస్సార్‌సీపీ 3వ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఎవరూ ఊహించని విధంగా సొంతిల్లు అందివ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ మహత్తర కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. అందులో భాగంగా అర్హులకు ఇళ్ల స్థలాలు అందిస్తున్నారన్నారు. ఇవే కాకుండా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ఇలా దేశంలో మరెక్కడా జరగడం లేదన్నారు. సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. వాసుపల్లి కొండబాబు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

బాలలకు అన్నదానం

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస భరోసా లిటిల్ హగ్స్ బాలల సంరక్షణ కేంద్రం చిన్నారులకు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అక్కరమాని మంగరాజు మూడు పూటల భోజనం ఏర్పాటు చేశారు. అతని తల్లి ఎల్లయ్యమ్మ జ్ఞాపకార్థం అనాథ బాలలకు భోజనం ఏర్పాటు చేసి పండ్లు, కిరాణా సామగ్రి అందించారు. కార్యక్రమంలో 12వ వారు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యం


మామిడిపాలెంలో నీటి సరఫరా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిచ్చిందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 1, 2 వార్డులకు సంబంధించి మామిడిపాలెంలో పైలట్ వాటర్ ప్రాజెక్టులో భాగంగా రూ.13.50 లక్షలతో తాగునీటి సదుపాయం, సంగివలస, అల్లూరి సీతారామరాజు కాలనీల్లో రూ.కోటి వంతున జీవీఎంసీ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ నిధులతో నిర్మించిన పాఠశాలలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 ఏళ్లుగా తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న మామిడిపాలెం ప్రజలకు పరిష్కారం చూపామన్నారు. ఈ ఐదేళ్లలో విద్యాభివృద్ధికి రూ.75 వేల కోట్ల మేర సీఎం వైఎస్ జగన్ ఖర్చు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగిస్తుందన్నారు. కార్యక్రమాల్లో జెడ్పీ కనక మహాలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, రెండో వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, కరుణాకరరెడ్డి, వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బింగి హరికిరణ్‌రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు నమ్మి లక్ష్మణ, చిప్పాడ వెంకటేష్, పీతల వెంకట అప్పారావు, చిల్ల సూర్యనారాయణ రెడ్డి, గుండాసి మధునాయుడు, చిల్ల ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.


సంగివలసలో స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ నిర్మించిన పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు

మధురవాడ: సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వానికి అంతా అండగా నిలవాలని కోరారు. జీవీఎంసీ 8వ వార్డు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ పరిసర ప్రాంతాల్లో రూ.1.50 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో ఆదిత్య ఓషన్ టవర్స్ ఎదురుగా తారకరామ లే అవుట్, మిథిలాపురి వుడా కాలనీ, రెవెన్యూ లే అవుట్‌లో రూ.78.90 లక్షలతో కాలువలు, కల్వర్టులు నిర్మించనున్నారు. రుషికొండ, మిథిలాపురి వుడా కాలనీల్లో జీవీఎంసీ సాధారణ నిధులు రూ.65.14 లక్షలతో రోడ్లు, కాలువల నిర్మాణం కోసం శిలాఫలకాలు ఆవిష్కరించారు.

శానిటేషన్ సెక్రటరీపై ఆగ్రహం

అనంతరం ఆయన ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. బింద్రానగర్‌లో సిబ్బంది శానిటేషన్ పనులు సక్రమంగా చేయడం లేని, పార్కు పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కాలనీ అసోసియేషన్ నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో శానిటేషన్ కార్యదర్శిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత మధురవాడలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరగా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, జెడ్పీ శైలజావల్లి, ఏఈ శ్రీధర్, వైఎస్సార్‌సీపీ 8వ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, లొడగల రామ్మోహన్, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, రాజేశ్వరి, వివిధ విభాగాల నాయకులు పిళ్లా సూరిబాబు, ఎంవీ రమణమూర్తి, శెట్టిపిల్లి గోపి, జగ్గుపిల్లి నరేష్, శ్రీదేవి, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.


మిథిలాపురి వుడా కాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, అధికారులు

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి


నగరంపాలెం శిబిరంలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న జేపీఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఉమావతి

మధురవాడ : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను అంతా సద్వినియోగం చేసుకోవాలని జేపీఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమావతి కోరారు. మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి జీవీఎంసీ జోన్ – 2 నగరంపాలెం తుఫాను బిల్డింగ్ వద్ద గురువారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఇక్కడ అందుతున్న సేవలు, మందులు, కళ్లద్దాలు కోసం ఎంత మంది నమోదు చేసుకున్నారు..?, ఎంత మందికి అందజేశారు..? అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరు పరిశీలించి మరింత మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఇక్కడ 482 మందికి కంటి, ఇతర పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ప్రశాంతి, దీపిక తదితరులు పాల్గొన్నారు.

రూ.12 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డులో రూ.12 కోట్ల అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. వార్డులో పలు పార్కులు, విద్యుత్ దీపాల ఏర్పాటుకు, బహిరంగ వ్యాయామశాలలు, స్పోర్ట్స్ థీమ్ పార్కు ఏర్పాటుకు, పలు రహదారుల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశామని, ఆ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారం చేపడితే విశాఖ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. చంద్రబాబుది గ్రాఫిక్స్ మాయాజాలం, మాయ మాటలని ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటిస్తే అమలు చేసి చూపించే వ్యక్తి అని కొనియాడారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా పేదలు ఇబ్బంది పడకూడదని సంక్షేమ పథకాలు కొనసాగించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో అన్ని పార్టీలు ఏకమైనా మరలా అధికారం చేపట్టేది వైఎస్సార్‌సీపీయే అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, నాయకులు అల్లాడ ఉమామహేశ్వరావు, లొడగల రామ్మోహన్, ఉప్పులూరి గోపి, మాదు చంటి, చెన్నాదాసు, దువ్వి వాసు, ముదుండి రాజేశ్వరి, ఎరుపల్లి అప్పలరాజు, బెందాలం పద్మావతి, అప్పలస్వామి, రమణమూర్తి, ఏఈ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలి మృతికి కారకులను శిక్షించాలి


పీఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న స్థానిక మహిళలు

పీఎం పాలెం: వివాహిత గొర్తి గీతాంజలి మృతికి కారకులైన టీడీపీ, జనసేన ముష్కరులను కఠినంగా శిక్షించాలని కోరుతూ పీఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీలో స్థానిక మహిళలు గురువారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భగా జీవీఎంసీ ఆరో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు కె.వరలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగనన్న సంక్షేమ పాలనలో తాను పొందిన లబ్ధిని గీతాంజలి ఆనందంగా చెప్పుకోవడాన్ని సహించలేక అమాయకురాలైన ఆమె మనసు గాయపరచే విధంగా టీడీపీ, జనసేన కిరాయి మూకలు ట్రోలింగ్ చేశాయన్నారు. ఆమె మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ర్యాలీలో అధిక సంఖ్యలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్‌లో రక్తదానం


సర్టిఫికెట్లతో రక్తదానం చేసిన వలంటీర్లు

తగరపువలస : భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల క్యాంప్‌లో భాగంగా గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 50 మంది వరకు వలంటీర్లు ఇందులో పాల్గొన్నారు. సర్పంచ్ చెల్లూరి పైడప్పడు, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, పంచాయతీ కార్యదర్శి డి.రఘునాథబాబు, తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యురాలు శోభారాణి చేతుల మీదుగా దివ్యాంగునికి ట్రై సైకిల్ అందించారు. రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు, డైరెక్టర్ రాహుల్, ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ బి.ఎస్. వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘గ్రామకంఠం స్థలంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దు’


గ్రామకంఠం స్థలంలో నిరసన వ్యక్తం చేస్తున్న శ్రీరవితేజ రజక సంక్షేమ సంఘం ప్రతినిధులు

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు రజక సంతపేట సర్వే నంబర్ 30లోని గ్రామకంఠంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దని శ్రీరవితేజ రజక సంక్షేమ సంఘం ప్రతినిధులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఇక్కడి రేవు స్థలంలో కమ్యూనిటీ హాలు, ఆటస్థలం తదితర అవసరాలకు తాము ఏళ్ల తరబడి స్థలాన్ని రక్షించుకుంటూ వస్తున్నామన్నారు. అటువంటిది తమకు సమాచారం లేకుండా విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు 10 సెంట్లు ఎలా కేటాయిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఇప్పటికే భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తహసీల్దార్ రమేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి జీవీ రమణ తదితరుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. దీనిపై తమకు న్యాయం చేయాలని కోరారు.

పంచాయతీలోకి మురుగునీరు వదలడంపై ఆగ్రహం


తాళ్లవలస పంచాయతీ వలందపేటలో ప్రవహిస్తున్న మురుగునీరు పరిశీలిస్తున్న దృశ్యం

తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ వలందపేటలో సంగివలస శశి విద్యాసంస్థలు మురుగునీటిని వదలడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేసి స్పందనలో ఫిర్యాదు చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి కీర్తి ప్రసాద్ ఆ ప్రాంతంలో గురువారం పర్యటించారు. జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు మీదుగా పైపులైన్ వేసి మురుగునీటిని పంచాయతీ పరిధిలో వదిలివేయడం వల్ల బావులు కలుషితమయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గోస్తనీగెడ్డలో మురుగునీరు కలుస్తున్నందున రజకుల వృత్తి పనులు సాగడం లేదని, పశువుల మేతకూ ఇబ్బందిగా ఉందని కార్యదర్శి దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఆయన శశి విద్యాసంస్థలకు నోటీసులు జారీ చేయడంతోపాటు పంచాయతీలో మురుగునీరు ప్రవహించకుండా అడ్డుకుంటామని తెలిపారు. ఆయనవెంట వైఎస్సార్‌సీపీ నాయకులు చిల్ల సూర్యనారాయణరెడ్డి ఉన్నారు.

ఇంటింటా బూత్ కమిటీల ప్రచారం

తగరపువలస: వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీల ప్రచారం గురువారం భీమిలి జోన్ పరిధిలో గురువారం జోరుగా సాగింది. చిల్లపేట, జీరుపేట గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ 2వ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, జిల్లా యువజన విభాగం వైస్ ప్రెసిడెంట్ బింగి హరికిరణ్‌రెడ్డి, సీనియర్ నాయకులు మునకాల ఆదినారాయణరెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, చిల్ల గణేష్ రెడ్డి, డెక్కతి శ్రీనివాసరెడ్డి, కొల్లి రెడ్డి, జీరు భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాయప్పాలెంలో సీనియర్ నాయకులు శీరపు మహాలక్ష్మి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. తగరపువలస పరిధిలో మాజీ కౌన్సిలర్ కొప్పల రమేష్, సీనియర్ నాయకులు తమ్మిన నరసింగరావు, లెంక రమేష్, కొప్పల కృష్ణ, గిడుతూరి పూర్ణ తదితరులు ప్రచారం చేశారు.


జీరుపేటలో ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం

భీమునిపట్నం: జీవీఎంసీ 3వ వార్డు అప్పికొండ వీధి సచివాలయ పరిధిలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.ప్రభాకర్‌నాయుడు ఆధ్వర్యంలో గురువారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎంతో మేలు చేశారన్నారు. మళ్లీ ఆయన ముఖ్యమంత్రి అయితేనే పథకాలు కొనసాగిస్తారన్నారు. ప్రతిపక్షాల విమర్శలను ఎవరూ నమ్మవద్దన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నాయకులు ఎర్నింటి అచ్చిబాబు, బోని సంజీవరావు పాల్గొన్నారు.

తీరంలో ఆక్టోపస్ కళేబరం



కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ తీరానికి గురువారం సాయంత్రం ఆక్టోపస్ కళేబరం కొట్టుకొచ్చింది. సాయంత్రం బీచ్‌కు వచ్చే పర్యాటకులు దీనిని ఆసక్తిగా తిలకించి, తమ ఫోన్లలో బంధించారు.

శ్మశానవాటిక కష్టాలకు చెక్

రూ.37 లక్షలతో సదుపాయాలు


నాడు : ముళ్లు, చెత్తతో శ్మశానవాటిక


నేడు : శ్మశానవాటికలో సుందరంగా నడకమార్గం

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులోని ప్రధాన శ్మశానం అంటే ఇప్పటి వరకు అత్యంత దారుణమైన ప్రదేశం. సాధారణంగా చనిపోయిన వారిని వారి కుటుంబ సభ్యులు ఎంతో బాధ, వేదనతో అంత్యక్రియల కోసం ఇక్కడకు తీసుకొస్తే... ఇక్కడి పరిస్థితులు మరింత ఆవేదనకు గురి చేసేలా వుండేవి. లోపల నేల మొత్తం ముళ్లు, రాళ్లతో నరకప్రాయంగా వుండేది. మృతదేహాలను దహనం చేయడానికి కనీసం ప్లాట్‌ఫారం లేకపోవడంతోపాటు వర్షాలు కురిసే సమయాల్లో మృతుల బంధువుల ఇబ్బందులు వర్ణనాతీతంగా వుండేవి. గత 35 సంవత్సరాలుగా ఇదే పరిస్థితి వున్నా... ఎవరూ పట్టించుకోకపోవడంతో స్థానికులు నరకయాతన అనుభవించేవారు. ఇలాంటి దారుణ పరిస్థితులను వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే స్పందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు రూ.37 లక్షలు మంజూరు చేయించారు.ఆ డబ్బులతో ఇటీవల పనులు ప్రారంభమై వేగంగా జరుగుతున్నాయి. శ్మశానం స్థలం ఆక్రమణకు గురికాకుండా చుట్టూ ఎత్తైన గోడ నిర్మించారు. లోపల నడిచేందుకు వీలుగా సిమెంట్ రోడ్డు నిర్మించారు. శ్మశానానికి వచ్చే మృతుల బంధువులు నిరీక్షించేందుకు ఒక గది నిర్మించారు. మృతదేహాలను దహనం చేయడానికి సదుపాయాలతో కూడిన ప్లాట్‌ఫారం ఏర్పాటు చేస్తున్నారు. వీటితోపాటు అవసరమైన నీటి సదుపాయంతోపాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. శ్మశానవాటికలో అవసరమైన వసతులు కల్పించడంతో స్థానికులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.


మృతుల ఆత్మీయులు నిరీక్షించే గది


దహన సంస్కారాలకు నిర్మిస్తున్న ప్లాట్‌ఫారం


శ్మశానవాటిక చుట్టూ నిర్మించిన ప్రహరీ

ఏమాత్రం ఊహించలేదు



ఇక్కడి శ్మశానంలోని పరిస్థితులు అత్యంత దారుణంగా వుండేవి. మా అప్పులు, బంధువులు చనిపోయినప్పుడు ఇక్కడకు వచ్చి అంతిమ కార్యక్రమాలు చేయాలంటే చాలా ఇబ్బంది పడేవారిమి. ఈ సమస్యపై ఎన్నో సార్లు అధికారులకు, పాలకులకు విన్నవించుకున్నా ఫలితం శూన్యం. ప్రస్తుతం ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించి, వసతులు కల్పించింది.
– టి.అప్పారావు, భీమిలి

ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు



చనిపోయిన వారికి దహన, ఖనన కార్యక్రమాలు శ్మశానవాటికలో సజావుగా ముగించాలని వస్తున్న మృతుల బంధువులు ఇప్పటి వరకూ నరక యాతన అనుభవించారు. కనీస వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోని ప్రభుత్వం శ్మశానవాటికలో సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయించడం ఎంతో గొప్ప విషయం. ఇందుకు ప్రత్యేక కృతజ్ఞతలు.
– కె.ముత్యాలరావు, భీమిలి

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


తునివలసలో ఇంటి పట్టా అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


బాందేవుపురంలో రైతు భరోసా కేంద్రం వద్ద ఎమ్మెల్యే శ్రీనివాసరావు, స్థానిక నాయకులు

పద్మనాభం: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని నెలకొల్పారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అనంతవరంలో రూ.23.99 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.20 లక్షలతో నిర్మించిన వెల్ నెస్ సెంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఇదే గ్రామంలో జల జీవన్ మిషన్ నిధులు రూ.1.20 కోట్లతో ఇంటింటికీ కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొవ్వాడలో జలజీవన్ మిషన్ నిధులు 70.05 లక్షలతో ఇంటింటికీ కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గంధవరంలో రూ.17.50 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్, బాందేవుపురంలో 21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. పొట్నూరులో జల జీవన్ మిషన్ నిధులు రూ.92.55 లక్షలతో, తునివలసలో రూ.14.60లక్షలతో ఇంటింటికీ కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తునివలసలో రూ.60 లక్షలతో రామాలయ పునః నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇదే గ్రామంలో 150 మందికి జగనన్న ఇంటి స్థల భూ హక్కు పత్రాలు, జగనన్న భూహక్కు, భూరక్ష పథకం కింద 508 మందికి హక్కు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అర్హులందరికీ పార్టీలతో సంబంధం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకు అందిస్తున్నారన్నారు.

భీమునిపట్నం నియోజకవర్గంలో 36 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చినట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో ఉత్తరాంధ్రకు మహర్దశ పడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విజయపతాకం ఎగురవేసి మరోసారి ముఖ్యమంత్రిగా విశాఖపట్నం నుంచే పరిపాలన కొనసాగిస్తారన్నారు. దీని వల్ల విజయగనరం, విశాఖపట్నం జంట నగరాలుగా అభివృద్ధి చెందుతాయన్నారు. చంద్రబాబు స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణమాఫీ చేస్తానని, జీరో వడ్డీ వర్తింపచేస్తానని మహిళలను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, తహసీల్దార్ ఎస్.వెంకటరావు, ఎంపీడీవో బి.శైలజ, కొవ్వాడ సర్పంచ్ పొన్నకాయల రత్నం, ఎంపీటీసీ సభ్యురాలు బోని రమణమ్మ, తునివలస ఎంపీటీసీ సభ్యుడు కిలారి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర బంగారప్పడు, జి.వి.కె.కె. వర్మ, మాదిరెడ్డి భాస్కరరావు, మరగడ అప్పారావు, బేపల గురునాయుడు, సీర సూరప్పడు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

పీఎం పాలెం : పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రుషికొండ మొహరం హాస్టల్‌లో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన టీవీఎస్ షోరూమ్ యజమాని కాసిన రమేష్ కుమారుడు కాసిన జస్వంత్ (19) రుషికొండలోని మొహరం హాస్టల్‌లో వుంటూ గీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం 7 గంటలకు జస్వంత్ రూమ్మేట్ మధన్ రూముకు వచ్చేసరికి డోర్ లాక్ చేసి ఉంది. మారుతాళంతో డోర్ ఓపెన్ చేయగా జస్వంత్ బెడ్‌షీట్‌తో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే అతని స్నేహితులు కిందకు దించి గీతం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు.

అయితే... జస్వంత్‌కు పిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించామని తల్లిదండ్రులకు హాస్టల్ వార్డెన్ ఫోనులో తెలియజేయడం గమనార్హం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుని తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.